

మహిళలు ఆకాశమే హద్దుగా ముందుకు సాగాలని ఎమ్మెల్సీ సురభివాణీదేవి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాల,మల్లారెడ్డి యూనివర్సిటీలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి ఎమ్మెల్సీ సురభివాణీదేవిని ఘనంగా సన్మానించారు.
-మేడ్చల్, మార్చి 8


నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, ఆదివారం 9 మార్చి 2025 | HYDERABAD




అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో బల్దియాకు చెందిన 400 మంది పారిశుధ్య మహిళా కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బల్దియా అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటాపురం డివిజన్ భూదేవి నగర్ రైల్వే ట్రాక్ కట్ట వద్ద ట్యాంకర్ నుంచి నీటిని సేకరిస్తున్న బస్తీ వాసులు



తాగునీటి కోసం నిరసన తెలుపుతున్న బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్‌లోని పద్మశ్రీహిల్స్ కాలనీ వాసులు

# మంచినీళ్లివ్వండి మహాప్రభో!

● దాహార్తి తీర్చాలంటూ జనాల వినతులు ● వేసవి ప్రారంభంలోనే నీటి కష్టాలు ● చర్యలు చేపట్టని పాలకులు, అధికారులు

న్యూస్ నెట్‌వర్క్, మార్చి8, (నమస్తే తెలంగాణ): రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో నీటి కష్టాలు స్వాగతం పలుకుతున్నాయి. వేసవి కాలం ప్రారంభ దశలోనే ఈ స్థాయిలో ఉంటే ఎండలు ముదిరితే పరిస్థితేంటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రేటర్ పరిధిలోని పలు డివిజన్లలో తాగు నీటి కష్టాలు తీర్చాలంటూ ప్రజాభవన్ మెట్లెక్కారు. మాజీ సీఎం కేసీఆర్ మిషన్ భగీరథ నీటిని తీసుకువచ్చి ఇంటింటికిచ్చి ప్రజల దాహార్తిని తీర్చితే, కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రం కరవొచ్చిందని తిట్టుకుంటున్నారు.

### ఇదే అదునుగా అక్రమ వసూళ్లు..

కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలో నీటి సమస్య జటిలంగా మారింది జలమండలి సరఫరా చేసే నీరు సరిపోక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధాన కాలనీల్లో ట్యాంకర్లను బుక్ చేసుకోగా, ట్యాంకర్ కు 800 నుంచి 1200 వరకు డిమాండ్ చేస్తున్నారు. ఇదే అదునుగా ప్రైవేట్ ట్యాంకర్ల నిర్వాహకులు 1800 వరకు వసూలు చేస్తున్నారు. రంగారెడ్డి నగర్ డివిజన్ ఆదర్శ్ నగర్‌లో ట్యాంకర్లు బుక్ చేసుకుంటే రెండు రోజుల తర్వాత వస్తున్నాయి. కాలనీలోని 4 బోర్లు ఇప్పటికే ఎండిపోయాయి. తమ ఇండ్లను కమర్షియల్ గా మార్చుకోవాలని పలువురిని జలమండలి సిబ్బంది హెచ్చరించారని కాలనీ వాసులు వాపోతున్నారు. పేట్ బషీరాబాద్, యాదిరెడ్డి బండ, సయ్యద్ నగర్ ప్రాంతాల్లో నాలుగు రోజులకు ఒకసారి నీటి సరఫరా జరుగుతున్నది. అయితే అరగంట పాటు మాత్రమే నీటిని సరఫరా చేస్తుండగా అరకొర నీటితో ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. మఖ్దూంనగర్, సోమయ్య నగర్, శ్రీనివాస్ నగర ప్రాంతాల్లో సరిపడా నీళ్లు రాక భూగర్భ జలాలు వినియోగిస్తున్నారు. అవి కూడా అయిపోతే పరిస్థితేంటని ఆందోళన చెందుతున్నారు. ఓఆర్ఆర్ బయటున్న కాలనీల్లో జలమండలి నీటి కనెక్షన్లు ఇవ్వకపోవడంతో ఆయా కాలనీలు, కమ్యూనిటీలు నీటిని కొనుగోలు చేసుకుంటున్నాయి.

### పదిరోజులుగా..

దాసర్లపల్లి గ్రామంలో పది రోజులుగా నీటి సమస్యతో అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముచ్చర్ల ప్లాంట్ నుంచి ఆ గ్రామానికి ప్రతిరోజూ 1,60,000వేల లీటర్ల నీరు రావాల్సి ఉండగా, కేవలం 50 వేల నీరు కూడా ప్రస్తుతం రావడంలేదు.

### నీటికోసం ప్రజాభవన్ మెట్లెక్కారు...

కేపీహెచ్బీ కాలనీ లో తాగునీటి కష్టాలను తీర్చాలంటూ కాలనీవాసులు ప్రజా భవన్ మెట్లెక్కారు. కాలనీ 1,2వ ఫేజ్‌లలో కలిపి 5000 కు పైగా ప్లాట్లు ఉండగా, 30 వేలకు పైగా జనాభా నివసిస్తున్నారు. వీరంతా జలమండలి సరఫరా చేసే నీటిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఎల్ఐజీలు, ఎంఐ జి ఫ్లాట్స్ ల లో ఉన్న బోరుబావులు ఉన్నప్పటికీ వేసవి ఎండలకు భూగర్భ జలమట్టం తగ్గిపోవడంతో ప్రజలకు సరిపడా నీరు అందుబాటులో లేకుండా పోయింది. శుక్రవారం కాలనీవాసులు ,అసోషియేషన్ నేతలు కలిసి ప్రజాభవన్ లో ప్లానింగ్ కమిషన్ చైర్మన్ చిన్నారెడ్డిని కలిసి నీటి సమస్యను పరిష్కరించాలని ఫిర్యాదును అందజేశారు.

### వాటర్ ట్యాంకులు నిర్మించి వదిలేశారు..

అల్వాల్ సర్కిల్ కౌకూర్ భరత్ నగర్ లోని రాజీవ్ గృహకల్ప బాంబే భవన సముదాలలో దాదాపు 12 వేలమంది పేదలు నివసిస్తున్నారు. సముదాయాల వద్ద రెండు పెద్ద వాటర్ ట్యాంకులను నిర్మించారు. అయితే వాటి నుంచి గృహ సముదాయ భవనాలకు నల్ల కనెక్షన్లు ఇవ్వలేదు. ఇంటి ముందు డ్రమ్ములను పెట్టుకొని ట్యాంకర్ల ద్వారా వచ్చే నీటిని నింపుకొని వాడుతున్నారు. ఐదు రోజులకొకసారి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. సరిపడా నీటి సరఫరా చేయకపోవడంతో పేదలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. వెంకటాపురం డివిజన్ భూదేవి నగర్ లో ని రైల్వే ట్రాక్ కట్ట వద్ద దాదాపు 100 కుటుంబాలు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారు. వీరికి ప్రత్యేకంగా నల్ల కనెక్షన్లు లేవు, వాటర్ వర్క్స్ ద్వారా ట్యాంకర్లు నీటి సరఫరా చేస్తున్నారు.

**బీఆర్ఎస్ హయంలో తాగునీటి సమస్య లేకుండే**

మాజీ సీఎం కేసీఆర్ మిషన్ భగీరథ పథకాన్ని తీసుకొచ్చి ఇంటింటికి నీళ్లనందించారు. ప్రస్తుతం మా గ్రామానికి రావాల్సిన మిషన్ భగీరథ నీరు సక్రమంగా రావడం లేదు. సమస్యను ఎండీవో దృష్టికి తీసుకువెళ్లాం.

-పోలేమోని బాలమణి అశోక్ ముదిరాజ్, తాజా మాజీ సర్పంచ్ .దాసర్లపల్లి

**తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చకుండా చూడాలి**

దాసర్ల పల్లి గ్రామంలో నెలకొన్న తాగు నీటి సమస్య తీవ్ర రూపం దాల్చకుండా చూడాలి. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో సమస్య ఏర్పడినట్లు స్పష్టమవుతుంది .కేసీఆర్ తీసుకొచ్చిన నీటిని సక్రమంగా పంపిణీ చేయకపోవడం బాధాకరం.

-తాండ్ర ఇందిరమ్మ దేవేందర్ తాజా మాజీ ఎంపీటీసీ తాజా మాజీ సర్పంచ్ దాసర్లపల్లి



శనివారం నారాయణగూడ జలమండలి కార్యాలయం వద్ద అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్‌లో నీటిని నింపుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# పర్మిషన్ ఒకలా.. నిర్మాణం మరోలా..

రెండతస్తుల అనుమతితో ఐదు ఫ్లోర్లతో భవనాలు

అక్రమ నిర్మాణాల నియంత్రణలో జీహెచ్ఎంసీ విఫలం



సికింద్రాబాద్ జోన్ పరిధిలోని కేశవ్‌నగర్‌లో ఓ ఇంటి యాజమాని (ఇంటి నంబరు 12-7-112/7/3) రెండతస్తుల నిర్మాణానికి అనుమతి తీసుకుని ఐదు అంతస్తుల వరకు నిర్మాణ పనులు జరుపుతున్నారు. భవన నిర్మాణం తుది దశకు చేరుకున్నది. ఈ భవనం నుంచి టౌన్ ప్లానింగ్ అధికారులను ముడుపులు అందినట్లు ప్రచారం ఉంది.




మెట్టుగూడ డివిజన్ విజయ్‌పురి కాలనీలో ఓ యజమాని పాత ఇంటి స్థానంలో (ఇంటి నంబరు 12-5-74/2) నూతన నిర్మాణ పనులు జరుపుతున్నారు. ప్రస్తుతం 3అంతస్తుల వరకు పనులు జరిగాయి. ఎలాంటి అనుమతి లేదు. టౌన్‌ప్లానింగ్ సిబ్బంది అందినంత దండుకున్నట్లు ఆరోపణలున్నాయి.



మెట్టుగూడ శివాలయం దగ్గరలో ఓ యాజమాని నిబంధనలకు విరుద్ధంగా లిఫ్ట్ నిర్మాణ పనులు చేపట్టాడు. స్థానిక ఏసీపీకి సమాచారం ఉన్న అక్రమ నిర్మాణాలను నియంత్రించలేదు. ఆయా భవనాల నుంచి కింది స్థాయి అధికారులు ముడుపులు తీసుకున్నట్లు ఆరోపణలు వచ్చినా.. పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

సిటీబ్యూరో, మార్చి 7 (నమస్తే తెలంగాణ)/వనస్థలిపురం: జీహెచ్ఎంసీలో అక్రమ నిర్మాణాలకు అడ్డు అదుపు లేకుండా పోతున్నది. ఫిర్యాదు వస్తేనే కానీ రంగంలోకి వచ్చి అలా నోటీసులు ఇచ్చినట్టే ఇచ్చి దొడ్డిదారిలో పనులను అనుమతులు ఇస్తున్నారు.. స్వయంగా కూకట్‌పల్లి, ఎల్బీనగర్, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్లుగా ఐఏఎస్ అధికారులు, సికింద్రాబాద్, శేరిలింగంపల్లి, చార్మినార్ జోన్లలో సీనియర్ అధికారులు జడ్సీగా వచ్చిన అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయలేక పోతున్నారు. అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం..నిబంధనలకు మించి నిర్మాణం చేపడితే నోటీసులు ఇచ్చి సదరు నిర్మాణాన్ని నేలమట్టం చేస్తాం..ఇది జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు, జీహెచ్ఎంసీ కమిషనర్ చెప్పే మాట..కానీ క్షేత్రస్థాయిలో మాత్రం కాసులకు కక్కుర్తి పడుతూ అక్రమార్కులకు అధికారులు కొమ్ముకాస్తున్నారు..ప్రమాదకరంగా నిర్మాణాలు జరుగుతున్నా కనీసం బాధ్యతగా వ్యవహరించడం లేదు..అనుమతులు ఇచ్చి వదిలేస్తున్నారు.

### సెలవుదినాల్లో పనికానిస్తున్నారు..

హస్తినాపురం డివిజన్ జెడ్పీరోడ్‌లోని వెంకటేశ్వర కాలనీ రోడ్ నం.3లో అక్రమ నిర్మాణం జరుగుతోంది. కే.వేణుగోపాల్ అనే వ్యక్తి తన ఇంటి పక్కనే ప్రమాదకరంగా, నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణం జరుగుతోందని అనేక సార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా..ఫలితం లేకుండాపోయింది. ఓ సారి అక్రమ నిర్మాణదారుడికి టౌన్‌ప్లానింగ్ అధికారులు నోటీసులు ఇచ్చినా..అతడు బేఖాతరు చేసి సెలవుదినాలు, రాత్రి వేళల్లో పనులు చేస్తున్నాడు. ఇదిలా ఉంటే..హస్తినాపురం డివిజన్‌లో జెడ్పీ రోడ్ ప్రధాన వాణిజ్య కేంద్రంగా మారింది. దీంతో రహదారికి ఇరువైపులా అక్రమ నిర్మాణాలు కోకొల్లలుగా పుట్టుకొస్తున్నాయి.

### ఫిర్యాదులు చేసినా పట్టించుకోరు

'హస్తినాపురం డివిజన్‌లో టౌన్‌ప్లానింగ్ శాఖ తీరు వివాదాస్పదంగా ఉంటోంది. ఫోన్, వాట్సాప్, యాప్ ద్వారా ఫిర్యాదులు వస్తే కనీసం స్పందించరు. లిఖిత పూర్వక ఫిర్యాదులకు కూడా స్పందన ఉండదు'. అని హస్తినాపురానికి చెందిన జాల శివ యాదవ్ పేర్కొన్నాడు.




హస్తినాపురం వెంకటేశ్వర కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణమవుతున్న భవనం

# ఆన్‌లైన్‌లో కనిపించదు... పేమెంట్‌కు చాన్స్ ఇవ్వదు

సమస్యల వలయంలో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ

సిటీబ్యూరో, మార్చి 8(నమస్తే తెలంగాణ) : లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీంలో సాంకేతిక సమస్యలు దరఖాస్తుదారులకు కొత్త ఇబ్బందులను తీసుకువస్తున్నాయి. తాజాగా ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించాలని నోటీసులు అందుకున్నవారు కూడా ఫీజు చెల్లించకలేకపోతున్నారు. కొందరికీ మైనస్ బ్యాలెన్స్‌తో బిల్లు జనరేట్ కావడంతో... అసలు ఏం జరుగుతుందో దరఖాస్తుదారులకు అంతు చిక్కడం లేదు. ఇక గతంలో ఎప్పుడో చెల్లించిన ఎల్ఆర్ఎస్ ఫీజు రసీదులోని వివరాలతో తాజాగా అప్లికేషన్ పురోగతి తెలుసుకునే వీల్లేకపోవడంతో... దరఖాస్తుదారులకు తమ ఇబ్బందుల గురించి ఎవరినీ ఆశ్రయించాలో తెలియక ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికీ లక్షలాది అప్లికేషన్లకు ఫీజు చెల్లించాలని నోటీసులు రాకపోవడంతో... ఎల్ఆర్ఎస్ ప్రక్రియ గందరగోళంగా మారుతుంది. అందుబాటులో ఉన్న లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీంతో దరఖా



స్తుదారులు చుక్కలు చూస్తున్నారు. రాయితీ గడువు తేదీ ముంచుకొస్తుండటంతో... ఫీజులు చెల్లించేందుకు, దరఖాస్తుల వివరాలు తెలుసుకోలేకపోతున్నారు. హెచ్ఎండీఏ పరిధిలో దాదాపు 8 లక్షలకు పైగా మంది ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకోగా... ఇందులో కొంతమందికి ఫీజు పేమెంట్ ఇంటిమేషన్ వచ్చింది. మిగిలిన దరఖాస్తులు వివిధ దశల్లో ఉండగా... ఆయా దరఖాస్తుల స్టేటస్ తెలుసుకోవడం కూడా గగనంగానే ఉంది. దీంతో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ ఎలా ముందుకు సాగుతుందనేది తెలుసుకోలేక గందరగోళానికి గురవుతున్నారు.

### ఆన్‌లైన్‌లో కనిపించదు..

కనీసం ఫీజులు చెల్లించిన వివరాలు కూడా వెబ్‌సైట్‌లో కనిపించకపోవడంతో... తాము చెల్లించిన ఎల్ఆర్ఎస్ ఫీజుతో ప్రాసెస్ చేస్తారా? లేదా అని కూడా తెలుసుకోలేకపోతున్నారు. ఇక ఫీజులు చెల్లించిన వారికి పేమెంట్ లింకులు వస్తున్నా... వెబ్‌సైట్ సర్వర్‌లో తలెత్తున్న సాంకేతిక సమస్యలు చుక్కలు చూపిస్తున్నాయి. హెచ్ఎండీఏ అధికారులు దృష్టి సారించి... ఈ పరిధిలోనే గతంలో చెల్లించిన ఫీజుల వివరాలు, ప్రస్తుతం ఆ దరఖాస్తుల స్టేటస్ తెలుసుకునే వెసులుబాటుతోపాటు, నిత్యం వస్తున్న సాంకేతిక సమస్యలకు పరిష్కరించాల్సిన అవసరం ఉంది. లేదంటే... నిర్ణీత గడువులోగా ఫీజు చెల్లించకపోతే రావాల్సిన 25శాతం రాయితీని కోల్పోతామని ఆందోళన చెందుతున్నారు.



చిన్నారి శ్రీవిద్య కు సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

## శ్రీవిద్యకు అండగా ఉంటా: ఎమ్మెల్యే

బేగంపేట, మార్చి 8 : శ్రీ విద్య చదువుకి అన్ని విధాలుగా అండగా ఉంటానని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారు. దాసారం బస్తీకి చెందిన అశోక్, మమత దంపతుల కూతురు శ్రీ విద్యకు ఆధార్ కార్డ్ లేదని స్కూల్ లో చేర్చుకోవడంలేదు. ఈ నేపథ్యంలో తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశాలతో బల్దియా అధికారులు దాసారం బస్తీలోని శ్రీ విద్య ఇంటికి వెళ్లి వివరాలు సేకరించి ఆధార్ కార్డ్ మంజూరుకు అవసరమైన సర్టిఫికెట్ జారీ చేశారు. శనివారం శ్రీ విద్యకు ఎమ్మెల్యే సర్టిఫికెట్‌ను అందజేశారు

అమీర్‌పేట: బల్కంపేటలోని ఎస్ వీ మాణిక్ ఆర్కేడ్ నివాసితుల సంఘం ప్రతినిధులు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యను మాజీ కార్పొరేటర్ ఎన్ శేషు కుమారి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సంబంధిత జలమండలి అధికారులతో ఫోన్ లో మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి కృషి చేయాల్సిందిగా ఆదేశించారు.



## రన్ ఫర్ యాక్షన్

అంతర్జాతీయ మహిళా దినోత్సవ స్ఫూర్తిని చాటుతూ నగర పోలీసుల ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్ లోని పీపుల్స్ ప్లాజా వేదికగా రన్ ఫర్ యాక్షన్ నిర్వహించారు. 3కే, 5 కే విభాగాల్లో జరిగిన ఈ రన్‌లో యువతీ యువకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# గుండె మార్పిడి చేసి..ప్రాణాలు కాపాడి..

ఖైరతాబాద్, మార్చి 8: గుండె జబ్బుతో బాధపడుతున్న ఓ యువకుడికి నిమ్స్ వైద్యులు కొత్త జీవితాన్ని ప్రసాదించారు. నగరానికి చెందిన పూజారి అనిల్ కుమార్ (19) కొంత కాలంగా గుండె జబ్బుతో బాధపడుతున్నాడు. నిమ్స్ దవాఖానలో చేరగా, పరీక్షించిన వైద్యులు గుండె మార్పిడి మాత్రమే పరిష్కారమని చెప్పారు. దీంతో గుండె మార్పిడికోసం జీవన్‌దాన్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. కాగా, రోడ్డు ప్రమాదంలో గాయపడిన 24 ఏండ్ల యువకుడు హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్‌కు గురాయ్యాడు. అతని కుటుంబ సభ్యులు అవయవదానానికి ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో ఆ యువకుడి బ్లడ్ గ్రూప్ అనిల్ కుమార్ బ్లడ్ గ్రూపుతో మ్యాచ్ అయ్యింది. దీంతో గ్రీన్ చానెల్ ద్వారా గుండెను నిమ్స్ దవాఖానకు



వైద్యులు తరలించారు. కార్డియో థొరాసిక్ విభాగాధిపతి డాక్టర్ అరమరేశ్ బాబు నేతృత్వంలో వైద్యుల బృందం శస్త్రచికిత్స నిర్వహించి విజయవంతంగా గుండెమార్పిడి చేశారు. ఆరోగ్యశ్రీ పథకంలో అనిల్ కుమార్‌కు పూర్తిగా ఉచితంగా శస్త్రచికిత్స నిర్వహించామని, ప్రస్తుతం అతను కోలుకుంటున్నాడని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప ఈ సందర్భంగా తెలిపారు.

### ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు.. మంత్రి దామోదర రాజనర్సింహ

అవయవ మార్పిడి విషయంలో అవకతవకలకు పాల్పడే ప్రైవేట్ ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి దామోదర రాజనర్సింహ హెచ్చరించారు. అవయవాల అక్రమ రవాణా, సేకరణ, మార్పిడులపై కఠిన శిక్షలు పడేలా కొత్త నిబంధనలు ఉండబోతున్నాయన్నారు. గాంధీ దవాఖానలో అధునాతన ఆర్గాన్ ట్రాన్స్ ప్లాంటేషన్ విభాగాన్ని అందుబాటులో తీసుకువస్తున్నామన్నారు. యువకుడికి గుండె దానం చేసిన అవయవదాత కుటుంబసభ్యులను మంత్రి అభినందించారు.

# నిరుపేదలకు కేసీఆర్ ఆరోగ్యశ్రీ ఫలాలు

● ఉచితంగా అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు ● ఒక్క నిమ్స్‌లోనే మూడేండ్లలో సుమారు రూ.230.80కోట్ల ఆపరేషన్లు

సిటీబ్యూరో: ఖరీదైన అవయవ మార్పిడి శస్త్రచికిత్సలను అవసరమైన నిరుపేద రోగులకు సైతం అందించాలనే సంకల్పంతో నాటి కేసీఆర్ ప్రభుత్వం అవయవ మార్పిడి శస్త్రచికిత్సలను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకువస్తూ తీసుకున్న నిర్ణయం ఎంతో మంది పేద రోగులకు పునర్జన్మ ప్రసాదిస్తున్నది. పైసా ఖర్చులేకుండా పూర్తి ఉచితంగానే అవయవమార్పిడి శస్త్రచికిత్సలు చేయించుకోవడంతో పాటు తదనంతర వైద్యసేవలను సైతం ఉచితంగానే పొందుతున్నారు.

### ప్రాణాలను కాపాడేందుకు....

ఒక్కో కిడ్నీ మార్పిడికి కార్పొరేట్‌లో సుమారు రూ.20లక్షల నుంచి రూ.30లక్షల వరకు ఖర్చవుతుంది. ఇక కాలేయ, గుండె మార్పిడి శస్త్రచికిత్సకైతే బయట రూ.30లక్షల నుంచి రూ.40లక్షల వరకు ఖర్చవుతుంది. బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంట్‌కు సైతం కార్పొరేట్‌లో రూ.25లక్షల నుంచి రూ.30లక్షల వరకు ఖర్చవుతుంది. అయితే ఈ బాధితుల్లో దాదాపు 80శాతం మంది నిరుపేద రోగులే కావడంతో వారు కార్పొరేట్ దవాఖానల్లో అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు చేయించుకునే ఆర్థిక స్తోమత లేక ప్రాణాలు కోల్పోయేవారు. మరికొంత మంది ఉన్న ఆస్తిపాస్తులను అమ్ముకుని ఆర్గాన్ ట్రాన్స్ ప్లాంట్ చేయించుకుని, జీవితాంతం ఆర్థిక సమస్యలతో సతమతమయ్యేవారు. నిరుపేదల ఆరోగ్య ఆక్రందన



లను చూసి చలించిన నాటి కేసీఆర్ సర్కార్ ప్రజల ప్రాణాలను కాపాడుకోవాలనే సంకల్పంతో ఖరీదైన అవయవమార్పిడి శస్త్రచికిత్సలను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకువచ్చారు. అప్పటి నుంచిల ప్రతి సంవత్సరం రాష్ట్ర వ్యాప్తంగా వేల మంది రోగులకు వందల కోట్ల రూపాయల విలువైన అవయవ మార్పిడి శస్త్రచికిత్సలను ఆరోగ్యశ్రీ కింద పూర్తి ఉచితంగా నిర్వహిస్తున్నారు. గడిచిన మూడేండ్ల కాలంలో ఒక నిమ్స్ దవాఖానలోనే సుమారు 577 అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు జరిగినట్లు నిమ్స్ డైరెక్టర్ డా.బీరప్ప తెలిపారు. ఈ మూడేండ్ల కాలంలో జరిగిన అవయవ మార్పిడి శస్త్రచికిత్సల మార్కెట్ విలువ సుమారు రూ.230.80కోట్ల వరకు ఉంటుందని అంచనా.

**నిమ్స్‌లో మూడేండ్లలో జరిగిన అవయవ మార్పిడి సర్జరీల వివరాలు**

| | |
|---|---|
| **2022లో** | |
| కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు | 93 |
| కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు | 05 |
| గుండె మార్పిడి శస్త్రచికిత్సలు | 04 |
| బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ | 61 |
| **2023లో** | |
| కిడ్నీ మార్పిడులు | 137 |
| కాలేయ మార్పిడి | 06 |
| గుండె మార్పిడులు | 01 |
| లంగ్ ట్రాన్స్‌ప్లాంట్ | 01 |
| బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ | 45 |
| **2024లో** | |
| కిడ్నీ మార్పిడులు | 134 |
| కాలేయ మార్పిడులు | 07 |
| గుండె మార్పిడులు | 01 |
| బోన్‌మ్యారో | 64 |
| **2025లో ఫిబ్రవరి వరకు** | |
| కిడ్నీ మార్పిడులు | 16 |
| కాలేయ మార్పిడులు | 01 |
| గుండె మార్పిడులు | 01 |